క్లుప్తంగా

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న లక్ష్మిరెడ్డి

కడప కల్చరల్ : పండుగలన్నీ మత సహనాన్ని ప్రబోధిస్తాయని నగర ప్రముఖులు ఆలంఖాన్ పల్లె లక్ష్మిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని మరియాపురం చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి విశ్వాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసు ప్రభు ప్రపంచానికి శాంతి, సమాధానాలు అందించారన్నారు. ప్రపంచమంతా నిర్వహించుకునే ఈ పండుగను మనం కూడా ప్రేమ, కరుణలు చాటుతూ నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశు, ఓబుల్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, జోజప్ప, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జంతుశాస్త్రంలో డాక్టరేట్



అపర్ణ

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న వై.అపర్ణకు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. జంతుశాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఎం.శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో 'ఎపికెసీ ఆఫ్ బయోఫ్లాక్స్ ఇన్ ద కల్చర్ ఆపరేషన్ ఆఫ్ పసిఫిక్ వైట్ ష్రిమ్ప్స్ లితోపీనియస్ వనామీ' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ



మెమెంటోతో తేజోమయి

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని విద్యామందిర్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న జి.తేజోమయి చదరంగం పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచింది. ఈనెల 22వ తేదీన బెంగుళూరు నగరం వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బెంగుళూరు రూరల్ డిస్ట్రిక్ట్ చెస్ అసోసియేషన్ పోటీల్లో అండర్-16 విభాగంలో తేజోమయి 3వ స్థానంలో నిలిచినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి.అనీస్‌దర్బారీ తెలిపారు. 6 రౌండ్లలో 4 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి

కడప రూరల్: పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2025వ సంవత్సరం నూతన క్యాలెండర్‌ను సోమవారం స్థానిక జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాజిక ఉద్యమకారులతో కూడిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత శిఖరాలను చేరాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్, జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, వేణు, శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



శ్రీనివాసులు



చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా స్టేట్ టీచర్ ఫెడరేషన్(ఎస్‌టిఎఫ్) నూతన కమిటిని ఎన్నుకున్నారు. కడపలోని ఎస్‌టిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షులుగా ఆవుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా కోపూరి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజగోపాల్‌రెడ్డి, వైఎస్ ప్రెసిడెంట్‌గా చిన్నరాముడు నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సుమలత, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటర్స్‌గా ఆలమూరు ప్రసాద్,, మహేశ్వరెడ్డిలు, జిల్లా కోశాధికారిగా కల్లె శ్రీనివాసులు, జిల్లా సిపిఎస్ కన్వీనర్‌గా సురేష్, అడిట్ కన్వీనర్‌గా ఎల్వి రవిశంకర్, జిల్లా కార్యదర్శులుగా పీవి వెంకటసుబ్బయ్య, గంటా రామ్మోహన్, శేఖర్, సీతారామయ్య, హెచ్ వెంకటరమణ, శివ, సురేంద్ర, వెంకటేశ్వర్లు, సురేష్, వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, శ్రీరాములు, మదన్‌రెడ్డి, రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా విద్యాసాగర్, వెంకటసుబ్బయ్యలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజుయాదవ్, రాష్ట్ర పరిశీలకులుగా రాష్ట్ర గౌరవ సలహాదారు శ్రీనివాసులు వ్యవమరించారు.

రక్షకుడు.. రానైయున్నాడు!

- క్రిస్మస్‌కు సిద్ధమైన ప్రార్థనాలయాలు
- విద్యుద్దీప కాంతుల్లో మెరుస్తున్న చర్చిలు



విద్యుద్దీప వెలుగుల్లో క్రైస్ట్ చర్చి



పూరి పాకలో ఏసుక్రీస్తు జన్మ ఘట్టాన్ని తెలిపే బొమ్మలు



కడప నగరం కాంగ్రిగేషనల్ చర్చిలో ఆకట్టుకుంటున్న విద్యుద్దీప అలంకరణ



కడప కల్చరల్ : కళ్లు చెదిరే వెలుగులు.. విద్యుద్దీప కాంతులు.. చర్చిలన్నీ ధగధగలాడుతున్నాయి. విశ్వాసుల ఇళ్లపై నక్షత్రాలు మెరుస్తున్నాయి..క్రీస్తు ప్రభువు ఆకాశ తారగా భువిపై పాపులను ప్రక్షాళన చేసి దైవ సన్నిధికి చేర్చే ఆ పవిత్రమైన రోజును ఈ వెలుగులు చెప్పకనే చెబుతున్నాయి. ప్రపంచానికి వెలుగునిచ్చే ఏసయ్య జనన శుభ సమయం వచ్చేందుకు ఇంకొక్కరోజే గడువు ఉంది. క్రైస్తవ లోకం ఇప్పటికే పండుగ ఆనందాన్ని ఆస్వాదించడం ప్రారంభించారు. ఏసుక్రీస్తు జన్మించిన శుభదినం క్రిస్మస్. లోకంలోని చీకటిని తరిమేందుకు తాను దివి నుంచి భువికి దిగిన దివ్య తారగా అరుదెంచనున్నారని క్రైస్తవ లోకం ఆనందోత్సాహాలతో పండుగకు సిద్ధమవుతోంది. బుధవారం క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఇప్పటికే జిల్లా అంతటా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. క్రైస్తవుల ప్రాబల్యం గల వీధుల్లో వందల మీటర్ల కొద్ది రోడ్డుకు ఇరువైపులా కళ్లు చెదిరేలా రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించి పండుగ శోభను కలిగించారు. క్రైస్తవుల ఇళ్లపై ఇప్పటికే క్రిస్మస్ తారలు తళుక్కుమంటున్నాయి. కేవలం క్రైస్తవ వీధులేగాక బ్రాండెండ్ దుకాణాలు, మార్కెట్లు కూడా పండుగ శోభను సంతరించుకుని విద్యుత్ దీప కాంతులతో వెలిగిపోతున్నాయి. చర్చిల్లో కూడా రంగురంగుల దీప కాంతులు కనిపిస్తున్నాయి. జిల్లాలోని చర్చిలన్నీ ఇప్పటికే ముస్తాబయ్యాయి. ఏసయ్య రాకను స్వాగతిస్తూ చర్చిలలోని ప్రతి అణువును విద్యుత్ దీప కాంతులతో నింపేశారు. 20 నుంచి 30 అడుగుల ఎత్తున్న క్రిస్మస్ చెట్లు, విద్యుత్ దీపాలు రూపొందించిన క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేస్తున్నారు. చర్చిల్లో లోపల పూర్తిగా రంగురంగుల అలంకరణ చేశారు. లోపల, బయట దూరంగా కూర్చొన్న భక్తులకు గురువుల సందేశం వినిపించేందుకు, దృశ్యం స్పష్టంగా కనిపించేందుకు భారీ విద్యుత్ డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. పగలు ప్రార్థనల కోసం ఇబ్బందులు కలగకుండా భారీగా పందిళ్లు వేశారు. చర్చిలన్నింటా పశువుల పాకలను రూపొందించి బాల ఏసును ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నగరంలో..

కడప నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్ చర్చి, సీఎస్ఐ సెంట్రల్ చర్చి, ఆరోగ్యమాతపుణ్యక్షేత్రంలోని చర్చిలు, ఎస్‌పీజీ చర్చి, మరియాపురంలోని క్యాథడ్రల్ చర్చి పూర్తిగా భూమికి వజ్రాల కిరీటాలు ధరింపజేసినట్లు విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరిసిపోతున్నాయి. విద్యార్థులు, యువకులు పెద్దల సూచనల మేరకు హడావుడిగా అటు, ఇటు పరుగులిడుతూ పండుగకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. గురువుల సూచనల మేరకు ప్రార్థనల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోని రాజారెడ్డివీధి, సియోనుపురం, ఎర్రముక్కపల్లె, మాసాపేట, మరియాపురంచర్చిలు గల వీధులన్నీ కనుచూపుమేర రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్నాయి. నగరంలోని పలు పెద్ద దుకాణాలు కూడా పండుగ శోభను సంతరించుకుంటూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా వార్షికోత్సవం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ ఆవరణంలో వున్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ (ఐఎంహెచ్)లో సోమవారం ఘనంగా మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. గత ఏడాది 2023 డిసెంబర్ 23న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబడింది. ఈ ఏడాదిలో జరిగిన వైద్యసేవలను గురించి ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు వివరించారు. డాక్టర్స్, రోగులు, వారి సహాయకులతో కలిసి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరాముడు మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తంలో దాదాపు 40 వేలమంది ఓపి సేవలను, 20 వేల మంది ఇన్‌పేషెంట్స్‌గా ట్రీట్‌మెంట్‌ను తీసుకున్నారన్నారు. ఇందులో డీ-ఆడిక్షన్ కింద 6500 మంది, నయంకాని మానసిక వ్యాధిగ్రస్తులకు, కరెంట్‌షాక్ ద్వారా ట్రీట్‌మెంట్‌ను 1000 మందికి అందించామన్నారు. మొదటి వార్షికోత్సవానికి సైక్రియాట్రిస్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఐఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ సుబ్రమణ్యం, ఇతర డాక్టర్స్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

'ఆ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోండి'

కడప సెవెన్‌రోడ్స్ : నిరుద్యోగులకు జాబ్ గ్యారంటీ అనే పేరుతో లక్షలాది రూపాయల అక్రమ సంపాదనకు పాల్పడిన ఒక ప్రధానోపాధ్యాయుడు, మరో ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రవి సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కోరారు. జాబ్ గ్యారంటీ పేరుతో యూ ట్యూబ్‌లో తరగతులు చెబుతూ లక్షలు ఆర్జిస్తూ మోసగిస్తున్నారని ఆరోపించారు. ఇంతవరకు విద్యాశాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంలోని ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హరిశ్చంద్రుని పాత్రకు జీవం పోసిన 'బలిజేపల్లి'



రంగ స్థల నటుడిని సత్కరిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి, కళాకారులు

కడప కల్చరల్ : హరిచంద్రుని చరిత్రను నాటకీకరించి ఆ పాత్రకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంతరించిపెట్టిన కవి బలిజేపల్లి లక్ష్మీకాంతం తెలుగు నాటకరంగంలో చిరస్థాయిగా కీర్తి సంపాదించారని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి బలిజేపల్లి లక్ష్మీకాంతం 143వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రుడి పాత్రను అద్భుతంగా నటించి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన శ్రీహరి రావుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గోపవరానికి చెందిన శ్రీహరిరావు బలిజేపల్లి హరిచంద్ర నాటకంతో ప్రభావితమై ఆ నాటకంలో ఆ పాత్రను వందల సార్లు ప్రదర్శించారని తెలిపారు. బలిజేపల్లికి ముందు పౌరాణిక నాటకాలను యథాతథంగా ప్రదర్శించేవారని, బలిజేపల్లి నాటకం దాన్ని సామాజిక కోణంలో బలంగా చూపారని, నైతిక విలువలకు పట్టం కట్టారని, అందులోని పద్యాలు నేటికీ తెలుగు పద్యాభిమానులు, గాయకులు కంఠంలో కమ్మదనంగా నిలిచాయని కొనియాడారు. రంగస్థల నటులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, తెలుగు విశ్రాంత అధ్యాపకులు జీవకళ సత్యనారాయణలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళాకారులు మందల మురళి, ప్రకాశం, కిరణ్, సత్యనారాయణ, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

విలువలు చట్టాని కంటే బలీయమైనవి



విద్యార్థులతో మానవతా సభ్యులు, పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్

కడప ఎడ్యుకేషన్ : విలువలు అనేవి చట్టానికంటే బలీయమైనవని మానవతా సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపీ పేర్కొన్నారు. సోమవారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో బాల వికాస్ హైస్కూల్‌లో 9,10 తరగతుల విద్యార్థులకు నైతిక విలువలు అనే అంశంపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సెక్రటరీ బీవీ సుబ్బారాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు సమాజంలో దైవ సమానులన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు భూపతి రాయల్, పాఠశాల డైరెక్టర్ గంగయ్య, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ ఉషా, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం 9, 10 తరగతి విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్, నగదు, మెమెంటోలను మానవతా సంస్థ వారు అభినందించారు.

ప్రైవేట్ మార్కెట్ యార్డులు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటెడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ మార్కెట్ యార్డుల ద్వారా రైతుల వ్యవసాయ ఉత్పత్తులను చౌకగా కార్పొరేట్ కంపెనీల పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నదని వామపక్ష రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం కేంద్ర కమిటీ పిలుపు మేరకు కడపలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగం చారిత్రత్మక పోరాటంతో తిప్పికొట్టిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు రామ్మోహన్, వెంకటశివ, సిఐటియు నాయకులు చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, రామకష్టారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టక్కోలి మనోహర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపరెడ్డి, శేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీలో అగ్రస్థానం



నమూనాలు పరిశీలిస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆహార ఉత్పత్తుల తయారీలో భారతదేశం అగ్రస్థానంలో ఉందని యోగివేమన విశ్వవిదాలయ వైస్ చాన్సులర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని హ్యాపీ కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఫార్మర్స్ మార్కెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ వైస్ చాన్సులర్ కృష్ణారెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కో చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్, కరస్పాండెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పోతల శివకుమారి పాల్గొన్నారు.

దంతవైద్యంలో మెలకువలు పాటించాలి

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వారి ద్వారా దంతవైద్యంలో మెలకువల కోసం పీజీ విద్యార్థులకు, ఆర్థోడాంటిక్స్ స్పెషాలిటీ డాక్టర్స్‌కు సీడీఈ కార్యక్రమం నిర్వహించామని ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జ్యోత్స్న తెలియజేశారు. ఎత్తు వంకర పళ్లను సరిచేసి ముఖాన్ని అందంగా తీర్చిదిద్దే విభాగంలో వున్న డాక్టర్స్‌కు మెలకువలను నేర్పించడానికి గెస్ట్ స్పీకర్‌గా చెన్నై నుంచి వచ్చిన ఆర్థోడాంటిక్స్ డాక్టర్ జనార్ధన్‌లతోపాటు,78 మంది పీజీలు, 20 మంది డాక్టర్స్, వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. కడప ప్రభుత్వ దంతవైద్య ఆర్థోడాంటిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ యుగంధర్, డాక్టర్ రామోహన్‌రెడ్డి, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ జాషువా, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ మాండవప్రసాద్‌లు వున్నారు.

ఘనంగా కాలభైరవస్వామి జయంతి



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



విశేష అలంకారంలో కాలభైరవస్వామి

కడప కల్చరల్ : కడప నగరం కాలభైరవపురంలోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ఆధునీకరించినంతరం జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేకించి ఈ ఆలయ ప్రత్యేక పూజల్లో ప్రధానమైన కుష్మాండ దీపరాధన (గుమ్మడికాయ దీపం)తో కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఒక దశలో చోటు చాలకపోవడంతో మూడు బృందాలుగా భక్తులచే కుష్మాండ పూజ నిర్వహింపజేశారు. ఈ పూజలో 500 మంది భక్తులు పాల్గొన్నారు. కాలభైరవపురాన్ని దత్తత తీసుకున్న బాసట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మేరువ బాలాజీరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అష్టోత్తర పారాయణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల బృందం హోమాన్ని చేపట్టారు. భక్తులకు పెద్ద ఎత్తున తరలి రావడంతో అన్నదానానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది.

ఓపెన్ పాఠశాలల యాజమాన్యంపై ఫిర్యాదు



డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పాఠశాలలను నిర్వహించకుండా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ నగిలి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓపెన్ పాఠశాలలు తరగతులు నిర్వహించకుండా ఫీజులు వసూలు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని వెంటనే అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 7వేలకు పైగా ఓపెన్ విద్యకు అభ్యసకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే జిల్లాలో ఎక్కడ కూడా తరగతులు నిర్వహించకుండా కేవలం పరీక్షల సమయంలో మాత్రమే హాల్ టికెట్ జారీ చేసి అభ్యర్థుల నుంచి వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు గురయ్య పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు తీర్మానంపై హర్షం

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి, రేనాటి యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటుకు సోమవారం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించడంపై వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి జిల్లా కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఏపీ దళితమిత్ర అధ్యక్షుడు కె.రామాంజనేయులు, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డి, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య అధ్యక్షులు డీఎం ఓబులేశు యాదవ్, విద్యార్థి నాయకుడు ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడుతూ తీర్మానం ఆమోదానికి కృషి చేసిన మేయర్ సురేష్‌బాబు, ఎక్స్ అఫిషియో సభ్యులు, కడప శాసనసభ్యులు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, కార్పొరేటర్లు, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలి



ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత దివంగత ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి, నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్, కడప అసెంబ్లీ కో ఆర్డినేటర్ బండి జకరయ్య, పీసీసీ జనరల్ సెక్రటరీ పీఎండీ అలీఖాన్‌లు మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని పక్కన పెట్టి మనుస్మృతిని భారత రాజ్యాంగ స్థానంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, అన్ని వర్గాల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్ఫాన్, ధ్రువకుమార్‌రెడ్డి, సుశీల్‌కుమార్, విజయకుమార్, గౌస్‌పీర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప అర్బన్ : నాగుల వీరభద్రయ్య బ్రాహ్మణ అన్నసత్రం ట్రస్టు నిర్వాహకులు నాగుల సత్యనారాయణ సతీమణి శశిల కుమార్తె స్పర్శ సింధూరి, నాగపూర్ నివాసి కార్తీక్‌ల వివాహ మహోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల నివాస వసతిగృహంలో నిరాశ్రయులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హిమవర్షిణి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గుండ్లకొండ విజయలక్ష్మి, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, నాగుల రాంప్రసాద్, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, మునిజ, దంపతులు స్పర్శసింధూరి, కార్తీక్, జైకుమార్, పద్మిని పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి



కృష్ణమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. సోమవారం కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో 'మన సంస్కృతి, సంప్రదాయాలు- స్త్రీల నడవడిక' అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనం, నైతిక విలువల ప్రాధాన్యత గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ సినీడాన్స్ మాస్టర్, హైదరాబాద్ నటరాజ కృష్ణమూర్తి సంస్కృతి ఫౌండేషన్ నిర్వాహకులు నటరాజ కృష్ణమూర్తి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య ఆవశ్యకతను వివరించారు. తెలుగుశాఖ విభాగాధిపతి జి.వీరయ్య, అధ్యాపకులు ఎం.వి.ఎస్.సుధారాణి, ఉర్దూ విభాగాధిపతి షాజియాబేగంలు స్త్రీ ఔన్నత్యం గురించి వివరించారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డాన్స్‌మాస్టర పల్లవి, కళాశాల అధ్యాపకులు జయంతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు దక్కించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీం బాషా తెలిపారు. ఐసీఐసీఐ, ఆక్సిస్ బ్యాంక్‌లకు సంబంధించిన రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు 11 మంది విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ పి.శైలజ, పి.వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.